• సిద్దిపేట కలెక్టర్ తీరు వివాదాస్పదం



సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తున్నది. గురువారం రుణమాఫీ సందర్భంగా సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి రైతువేదిక వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ అగ్రనేతలైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కలెక్టర్ హోదాలో ఉండి రాజకీయ నేతల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేయడం వివాదాస్పదమైంది.

• కాంగ్రెస్ జెండా మోసిన నాకే మాఫీ కాలేదు



కాంగ్రెస్ పార్టీ కోసం మొదటి నుంచి జెండా మోసిన. రైతు రుణమాఫీ చేస్తామని ఎన్నికల హామీలో ఇస్తే విస్తృతంగా ప్రచారం చేసిన. రైతులకు మేలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి నాకు న్యాయం చేయలేదు. 2017లో రూ.30 వేలు రుణం తీసుకున్న. నాకు మాత్రం మాఫీ కాలేదు. కాంగ్రెస్ పార్టీ కోసం ఏండ్ల తరబడి జెండాలు మోస్తే నాకు న్యాయం జరగలేదు. – సోల్తీ రవీందర్, కాంగ్రెస్ కార్యకర్త, బొల్లికుంట, ఖిలావరంగల్

# కేసీఆర్ చేసిండు.. ఇప్పుడు కాలే..

## • రుణమాఫీ జాబితాలో నాపేరు లేదు



నాకు 26 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. పాస్‌బుక్ సహాయంతో నిరుడు రూ.38 వేల పంట రుణం తీసుకున్న. ప్రభుత్వం గురువారం ప్రకటించిన మొదటి విడత రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. లక్షలోపు రుణాలు మాఫీ చేస్తామని చెప్తున్న ప్రభుత్వానికి సంబంధిత అధికారుల వైఫల్యం వల్ల నాలాగా చాలామంది రైతుల పేర్లు జాబితాలో లేవు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నేను రూ.34 వేలు రుణం తీసుకోగా వడ్డీతో కలిపి నాకు రూ.38 వేలు మాఫీ అయ్యింది. ఆ తర్వాత తిరిగి రూ.38 వేలు పంట రుణం తీసుకున్న. తాజాగా రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు.

- షేక్ రంజాన్, రైతు, కొత్తపేట, మం: కేతేపల్లి, జిల్లా: నల్లగొండ



## కాంగ్రెస్ సర్కార్ మాఫీ చేయలె..

నాకు 3 ఎకరాల భూమి ఉన్నది. దాదాపు 30 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పహాణీతో రూ. 50 వేల రుణం తీసుకున్న. మొదటి విడతలో రూ. లక్ష రుణమాఫీ అయ్యింది. కానీ అందులో నా పేరు లేదు. నాకు తెల్లరేషన్ కార్డు ఉన్నది. కానీ పట్టా లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాఫీ అయ్యింది. ఈ ప్రభుత్వం మాఫీ చేయలేదు. మాలాంటి పేద రైతులకు రుణం మాఫీ చేయాలి. ఎన్నో ఆశలతో మాఫీ కోసం ఎదురు చూస్తే చివరకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా మాలాంటి నిరుపేద రైతులకు మాఫీ చేయాలి.

- జాడి లింగన్న, రైతు, ఘన్‌పూర్, జిల్లా ఆదిలాబాద్



## నాకెందుకు చేస్తలేరు?

నాకు మూడు ఎకరాలు ఉన్నది. పెట్టుబడి కోసం కమలాపూర్ యూనియన్ బ్యాంకులో పాసు పుస్తకం కుదవపెట్టి లక్ష రూపాయలు క్రాప్‌లోన్ తీసుకున్న. పెట్టుబడికి తీసుకున్న లక్షకు మిత్తి రూ.60 వేలు అయింది. కేసీఆర్ సార్ ప్రభుత్వంలో లక్ష మాఫీ కాగా, అరవై వేల మిత్తి మిగిలి ఉన్నది. మిత్తి చెల్లించే వరకు పట్టాదారు పాసుపుస్తకం బ్యాంకులోనే ఉంచుకున్నరు. రూ. 60 వేలు అప్పు అట్లనే ఉన్నది. మా ఊళ్లో లక్ష రూపాయల లోపు అప్పు ఉన్న వాళ్లకు 237 మందికి మాఫీ అయిందన్నరు. నాకు ఎందుకు మాఫీ కాలేదో తెలియదు.

- మామిడిశెట్టి ఓదె లక్ష్మి, రైతు, గూడూరు, జిల్లా హనుమకొండ

## • ఎవరిని అడిగినా చెప్తలేరు



నాకు 2 ఎకరాలు 30 గుంటలు భూమి ఉన్నది. బ్యాంకులో రూ.75 వేల రుణం తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం విడదల చేసిన లక్ష లోపు రుణ మాఫీ లిస్టులో నా పేరు లేదు. ఇప్పుడు ఎవరిని అడిగినా చెప్తలేరు. నాకు పెట్టుబడి సాయం రైతు భరోసా ఇవ్వలేదు. రుణమాఫీ కూడా కాలేదు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ 2023లో రూ.75 వేలు రుణమాఫీ చేసిన్రు.

- చెక్కల రామచంద్రయ్య, రైతు, తొడేళ్ల గూడెం, జిల్లా మహబూబాబాద్

# రుణమాఫీపై రైతుల భిన్నస్వరాలు



## • అడిగితే రెండో విడత అంటున్నరు

నేను మాచారెడ్డి ఎస్‌బీఐలో రూ.37 వేల పంట రుణం తీసుకున్న. రుణమాఫీ లిస్టులో నా పేరు రాలేదు. అధికారులను అడిగితే మొదటి విడతలో కొంతమంది రైతులనే అర్హులుగా గుర్తించారని, రెండో విడతలో మిగతా రైతులకు రుణమాఫీ అవుతుందని చెప్తున్నరు. ఏకకాలంలో లక్షలోపు ఉన్న ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం రూ.50 వేలలోపు ఉన్నవారిని అనర్హులుగా గుర్తించడం విడ్డూరంగా ఉన్నది.

- బట్ట ఎల్లయ్య, అక్కాపూర్, మం: మాచారెడ్డి, జిల్లా కామారెడ్డి

## • లిస్టులో నా పేరు లేదు!



నాకు పాముసూర్ గ్రామంలో ఎకరం ఐదు గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. నేను 7 డిసెంబర్ 2021న శివునిపల్లి ఎస్‌బీఐలో రూ. 52 వేల పంట రుణం తీసుకున్న. మిత్తితో కలిపి రూ.61 వేలు అయ్యింది. లక్ష లోపు పంట రుణాలను సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మాఫీ చేస్తున్నాడంటే సంతోషపడ్డ. తీరా లిస్టులో చూస్తే నా పేరు లేదు. అధికారులను అడిగితే ప్రాసెస్‌లో ఉన్నదని అంటున్నరు. నాకు పంట రుణం మాఫీ అయితదో, కాదో అని టెన్షన్‌గా ఉన్నది.- వంగ సదానందం, రైతు, శివునిపల్లి

## • నాకే కాదు.. చాలామందికి రాలే!



పాపన్నపేట కోఆపరేటివ్ బ్యాంకులో 2022లో రూ.70 వేల పంట రుణం తీసుకున్న. 2023లో రెన్యువల్ సైతం చేసుకున్న. నాకు రెండు ఎకరాల పైచిలుకు పట్టాభూమి ఉంది. పాసుబుక్ కూడా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టా పాసుబుక్ ఉన్న అందరికీ పంట రుణ మాఫీ చేస్తా అని చెప్పింది. లిస్టులో నాపేరు లేదు. నాలాంటి వారు చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదు. కాంగ్రెస్ సర్కారు మాట తప్పద్దు. అందరు రైతులకు రుణమాఫీ చేయాలి.- పట్లోళ్ల రవళి, రైతు, మల్లంపేట గ్రామం, మెదక్ జిల్లా

## • ఎమ్మెల్యే కాలెను అడిగితే చెప్తలేడు



నేను చేవెళ్ల సొసైటీ బ్యాంక్‌లో 2018లో రూ.35 వేలు తీసుకున్న. తీరా చూస్తే నా రుణం అలాగే ఉన్నది. జాబితాలో నా పేరే లేదంటున్నరు. నాకు రుణమాఫీ ఎందుకు కాలేదని చేవెళ్ల రైతు వేదికలో జరిగిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, అధికారులను అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. వివరాలను తెలుసుకుంటామని చెపుతున్నరు. రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పుతున్నది. 35 వేలే రుణమాఫీ చేయలేదు. ఇంక రూ.2 లక్షల మాఫీ ఎప్పుడవుతుందో దేవుడికే తెలియాలి. నాకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. - బండారి సుధాకర్ రెడ్డి, రైతు, గ్రా: చేవెళ్ల, రంగారెడ్డి



## సీఎం ముచ్చటంతా డౌటే కొడ్తున్నది!

**రుణమాఫీ చేస్తాం..** చేస్తాం అని ఊరించారు.. రూ.లక్ష లోపు రుణం తీసుకున్నవారివి మాఫీ చేస్తున్నామని ప్రకటించారు. జాబితా పెట్టారు. తీరా చూస్తే అందులో నాపేరు లేదు. అసలు ఇదేం రుణమాఫీ అనేది అర్థం కావడం లేదు. నాకు భార్య, ఇద్దరు పిల్లలు. మొదటి నుంచి వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నం. నాకు ఎకరం పది గుంటల భూమి ఉంది. ఈ భూమే మాకు జీవనాధారం. పెద్ద సాగు ఉన్న రైతును కూడా కాదు. జగిత్యాల పట్టణంలోని యూనియన్ బ్యాంక్‌లో రెండేండ్ల కింద యాభై వేల క్రాప్ లోన్ తీసుకున్న. వడ్డీతో కలిపి ఇప్పుడు డెబ్బై వేలు కూడా కాలే. రైతు రుణమాఫీ అంటున్నరు కదా. నాకు అవుతుందని అనుకున్న. రూ.లక్ష లోపు రుణం ఉన్నవారికి చేస్తమని సీఎం చెప్పడంతో పక్కా అవుతుందని అనుకున్న. బుధవారం రాత్రి జాబితా ప్రకటించామని చెప్పారు. అందులో కచ్చితంగా నాపేరు ఉంటుందనుకున్నా. తీరా ఇవ్వాళ పొద్దుగాళ వచ్చిన లిస్టు చూస్తే నా పేరు లేదు. రెండుమూడు సార్లు చూసిన. నా పేరు కనిపించలేదు. అధికారులను అడగాలనుకున్నా ఎవరూ అందుబాటులో లేరు. లక్షలోపు వారికి అన్నరు. మరి ఏందో నాకు అర్థం కావడం లేదు. నాకు ఆహార భద్రత కార్డు ఉన్నది. ఇన్‌కంటాక్స్ కట్టింది లేదు. నాకు సర్కార్ నౌకరీ లేదు. పదివేలకుపైగా పెన్షన్ రాదు. మరి నాకెందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదు. ఫ్రీ కరెంట్ కూడా అందడం లేదు. ఇప్పటివరకు 200 యూనిట్లకు మించి కరెంట్ వాడలేదు. ఇదంతా చూస్తే కాంగ్రెస్ పనితీరు. సీఎం ముచ్చట అంతా డౌటే కొడుతున్నది.

- బొలిశెట్టి రమేశ్, తాటిపెల్లి, జగిత్యాల రూరల్ మండలం



## అటు రైతుబంధు లేదు.. ఇటు మాఫీ లేదు!

నా పేరు మీద రూ.43 వేలు పంట రుణం తీసుకున్న. 2024 ఫిబ్రవరిలో రూ.10 వేలు వడ్డీ చెలిస్తే రుణం రెన్యువల్ చేసి తిరిగి రూ.48 వేలు ఇచ్చింద్రు. సీఎం చెప్పినట్టు డిసెంబర్ వరకు అయితే నాకు పంట రుణం మాఫీ కావాలే. కాని నాపేరు లిస్టులో లేదు. ఒక్కో ఇంట్లో ముగ్గురు, నలుగురు పేర్లు పంట రుణం అయినట్టు వచ్చినాయి. చెప్పింది ఒకటి చేసేది మరొకటిలా ఉన్నది. నా కుటుంబం మొత్తం డిసెంబర్ 2023 వరకు నా పేరున ఎస్‌బీఐలో రూ.43 వేలు, నా కొడుకు పేరిట డీసీసీ బ్యాంకులో రూ.45 వేలు మాత్రమే ఉన్నాయి. లక్ష లోపు రుణం మాఫీ చేస్తామని చెప్పిన్రు తప్ప చేసిందేమీ లేదు. పంట పెట్టుబడికి కష్టంగా ఉన్నది. అటు రుణమాఫీ లేదు. ఇటు రైతుబంధూ వేయడం లేదు. మాలాంటి రైతులకు న్యాయం చేయండి.

- తుంపిల్ల సోమయ్య, రైతు కొమ్ములవంచ, మహబూబాబాద్



## లక్షలోపు ఉన్నవారికి చేస్తానన్నడు కదా?

లక్షలోపు రుణం ఉన్న ప్రతి ఒక్కరికీ మాఫీ చేస్తానని సీఎం సార్ చెప్పిండు. కానీ నాపేరు లిస్టులో రాలేదట. నా పేరు మీద రూ.35 వేల అప్పు మాత్రమే ఉన్నది. నాకు ఎందుకు రుణమాఫీ కాలేదు. అధికారులను అడిగితే రెండోవిడత అని చెబుతున్నరు. అది ఎప్పుడు వస్తదో ఏమో తెలుస్తలేదు.

-విస్లావత్ లాల్‌సింగ్, కాకులగుట్టతండా, జిల్లా కామారెడ్డి




## బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఫొటోకు బదులు కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫొటోతో సంబురాలు

మెదక్ జిల్లా వెల్దుర్తి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాల్లో వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో ప్రొటోకాల్ విస్మరించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫొటో కాకుండా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఫొటో పెట్టడం చర్చనీయాంశమైంది. తప్పును గుర్తించకుండా కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యంగా మేల్కొన్న అధికారులు మధ్యలోనే బ్యానర్ తొలిగించి కార్యక్రమాన్ని కొనసాగించారు. - వెల్దుర్తి

## • పహాణీ ఉన్న మేము రైతులం కాదా?



'పట్టాదారు పాస్‌బుక్కులు ఉన్న రైతులే అసలైన రైతులా? పట్టాబుక్కులు లేకుండా పహాణీలతో రుణాలు తెచ్చుకొని పంటలు సాగుచేస్తున్న మేము అసలు రైతులమే కాదా? 'రైతులందరికీ రుణమాఫీ' అంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు పట్టాబుక్కు రైతులనే మాఫీ చేస్తున్నదంటే పట్టాబుక్కుల్లేని రైతులను మోసం చేసినట్లు కాదా? రుణమాఫీకి అర్హులను గుర్తించడంలో నిజమైన రైతులకు పూర్తిగా అన్యాయం జరిగింది. పట్టాబుక్కులున్న రైతులు పంట రుణాలు పొంది వ్యవసాయం చేయకున్నా వారికి రుణమాఫీ జరిగింది. కానీ పహాణీలో పంట రుణాలు తెచ్చుకొని రెక్కలు ముక్కలు చేసుకొని పంటలు పండించిన మేము రైతులం కాదా? నాకు పట్టాబుక్కు లేదు. పహాణీ ఉంది. దానిమీదనే నేను చంద్రుగొండ గ్రామీణ వికాస్ బ్యాంకులో పంట రుణం తెచ్చుకొని వ్యవసాయం చేసుకుంటున్న. కానీ ఈ రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. నాకు రుణమాఫీ కాలేదు. నాలాంటి వారు ఇంకా ఎందరో ఉన్నారు.

-చాపలమడుగు రామరాజు, రైతు, అయ్యన్నపాలెం, చంద్రుగొండ, భద్రాద్రి జిల్లా



## రైతులందరికీ ఒకేసారి ఇస్తే బాగుండేది

మా ఊర్లో నాకు మూడెకరాల భూమి ఉన్నది. తెలివి వచ్చిన నాటి సంది ఎవుసమే ఆధారంగా బతుకుతున్న. నా పొలం మీద రూ.1.2 లక్షల లోను తీసుకున్న. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని టీవీలల్ల, పేపర్లల్ల చూసి సంతోషపడ్డం. కానీ, ఇయ్యాల లక్ష రూపాయల లోపు ఉన్న వాళ్లకే రుణమాఫీ చేస్తున్నారని తెలిసింది. రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేసి ఉంటే బాగుంటుండె.

- ఎస్ రమేశ్, మూడుచింతలపల్లి, మేడ్చల్



## లిస్టులో నా పేరు లేకపోవడం బాధగా ఉన్నది

రైతు రుణమాఫీ జాబితాలో నా పేరు లేకపోవడం బాధగా ఉంది. తర్వాతి లిస్టులో వస్తుందని అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం ఏక కాలంలో రుణ మాఫీ చేస్తే బాగుంటుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 9 ఏండ్లు రైతులు సుఖంగా ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా రైతులను పట్టించుకోవడం లేదు. -రామిరెడ్డి నర్సింహారెడ్డి, కీసర దాయర, మేడ్చల్ జిల్లా



## బ్యాంకుల అడుగుమంటున్నరు..

నేను రూ.25 వేల క్రాప్‌లోన్ తీసుకున్న. దీనిని ఏటా రెన్యువల్ చేయించిన. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు చేసిన రుణమాఫీ నాకు వర్తించలేదు. గురువారం సాయంత్రానికల్లా రూ.లక్ష మాఫీ చేస్తమన్నరు. కానీ, నేను తీసుకున్న రూ.25 వేలే అయినా మాఫీ కాలేదు. ఇంకా రూ.లక్ష ఎట్లయితది? వ్యవసాయాధికారులను అడిగితే బ్యాంకులో అడగాలని చెబుతున్నరు.

-పాశం ఓదెలు, రాజాపూర్, మం: రామగిరి, జిల్లా జగిత్యాల



## మాకేలిస్టు రాలేదు.. నీకేం చెప్పాలంటున్నరు

స్టేషన్‌ఘన్‌పూర్ కాకతీయ గ్రామీణ బ్యాంకులో మూడేండ్ల క్రితం రూ. 21 వేలు పంట రుణం తీసుకున్న. రెన్యువల్ చేశా. మిత్తితో ఇప్పుడు రూ. 28 వేలు అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేసిందని ఆనందపడ్డ. తీరా లిస్టులో నా పేరు లేదు. బ్యాంకుకు పోయి అడిగితే మాకే లిస్టు రాలేదు, నీకేం చెప్పాలి అంటున్నరు. లక్ష లోపు అందరికి మాఫీ చేశారా? లేక కొందరికి మాత్రమే ఇచ్చారో తెలియడం లేదు.

- ఎండీ మహిపాషా, రైతు, ఇప్పగూడం, జిల్లా జనగామ

# గూడెం, బండ్లకు నిరసన సెగ

- ఏసీ(అసలు కాంగ్రెస్) వర్సెస్ వీసీ (వలస కాంగ్రెస్)
- కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు
- వలస నేతలకు తప్పని భంగపాటు
- మాఫీ సంబురాల్లో చేదు అనుభవం



కాంగ్రెస్ కార్యకర్తపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం/గద్వాల, జూలై 18: రైతు రుణమాఫీ సంబురాలు సంగ్రామాలను తలపించాయి. రైతువేదికల సాక్షిగా ఏసీ(అసలు కాంగ్రెస్) వర్సెస్ వీసీ (వలస కాంగ్రెస్) మాటల యుద్ధం జరిగింది. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం సోలక్‌పల్లిలో గురువారం నిర్వహించిన రుణమాఫీ సంబురాల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో గ్రూపు విభేదాలు భగ్గుమన్నాయి. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జై కాట శ్రీనివాస్‌గౌడ్.. జై కాంగ్రెస్ అని నినాదాలు చేయడంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఒకింత అసహనానికి గురయ్యారు. ఎన్నో ఏండ్ల నుంచి కాట శ్రీనివాస్‌గౌడ్ పటాన్‌చెరులో కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేస్తుండగా.. ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే పార్టీలో చేరడాన్ని హస్తం నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. కాంగ్రెస్ కార్యకర్తల నినాదాలు జోరు అందుకోగా, రైతుకు స్వీటు తినిపించి జిన్నారం మండలంలో గ్రామాల రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్యను మాత్రమే చదివి ఎమ్మెల్యే రెండు నిమిషాల్లోనే ప్రసంగాన్ని ముగించారు. కనీసం స్టేజీపై ఉన్న కాంగ్రెస్ నేతలు నీలం మధు, గాలి అనిల్‌కుమార్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేశ్‌ల పేర్లు కూడా ఉచ్ఛరించకుండానే రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు.. రైతులకు శుభాకాంక్షలు.. అధికారులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ధన్యవాదాలు అంటూ స్టేజీ దిగి వెళ్లిపోయారు. అంతకుముందు సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు వేసిన కుర్చీలపై ముఖ్య నాయకులతోపాటు మాజీ జడ్పీటీసీ కూర్చోవడం.. మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నిలబడటంతో కార్యక్రమంలో గందరగోళానికి కారణమైంది. పార్టీ కోసం పని చేసిన తాము నిలబడి, ఇప్పుడు వచ్చిన వారు కూర్చోడమేమిటి? తామంతా ఎక్కడ కూర్చోవాలి? అని వాదనకు దిగారు. మాజీ జడ్పీటీసీ కుర్చీలోంచి లేచే వరకూ కాంగ్రెస్ కార్యకర్తలు మొండిపట్టుపట్టారు. కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహ జ్వాలకు కార్యక్రమంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. వాడెవ్వడు.. వీడెవ్వడు అని కాంగ్రెస్ కార్యకర్త చేసిన నినాదంపై ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఒక్కసారిగా సీరియస్ అయ్యారు. 'ఏయ్.. తమాషాగా ఉందా.. అట్ల మాట్లాడితే బాగుండదు.. హా..' అని ఉరిమి చూస్తూ హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఎవరూ తగ్గలేదు. దీంతో ఎమ్మెల్యేతోపాటు కూర్చున్న నాయకులందరూ ఒక్కొకరుగా లేచి వేదికపైకి వెళ్లారు. మాజీ జడ్పీటీసీ కే ప్రభాకర్ ఒక్కరే కింద కార్యకర్తలతోపాటు నిలబడ్డారు.



గద్వాల జిల్లా ధరూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

## • గద్వాలలో ఎవరికి వారే..

**గద్వాల కాంగ్రెస్‌లో** మరోసారి విభేదాలు బయటపడ్డాయి. గురువారం సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ ప్రకటన చేయడంతో ఉదయమే తన అనుచరులు సంబురాలు చేసుకోవాలని మాజీ జడ్పీచైర్‌పర్సన్ సరిత సూచించడంతో అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్‌తో కలిసి ఎడ్లబండిపై ర్యాలీ చేపట్టి సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తర్వాత ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ధరూర్‌లో సీఎం చిత్రపటానికి తన అనుచరులతో కలిసి క్షీరాభిషేకం చేసి సంబురాలు చేశారు. ఇలా వేర్వేరుగా సంబురాలు చేసుకోవడం గమనార్హం.